
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 32.0 కనిష్ఠం: 24.0

ANDHRAJYOTHY



వరదపై ఆశలు

- స్వల్పంగా వస్తున్న నీటితో నిండుగా జూరాల
- గతేడాది వానలు లేకపోవడంతో క్రాప్ హాలిడే ప్రకటించిన అధికారులు
- ఈ ఏడాది ఇప్పటికే నెట్టెంపాడు, భీమా 1, 2, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలకు పంపింగ్
- ఎక్కువ మొత్తంలో వరద వస్తే శ్రీశైలం డ్యాంకు విడుదల
- అప్పుడే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందజేత



నిండుగా ఉన్న జూరాల ప్రాజెక్టు

మహబూబ్‌నగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వల్పంగా వస్తున్న వరదతోనే జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దాదాపు 20 రోజులుగా కొద్ది కొద్దిగా వరద వచ్చి చేరుతుండటం.. వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా తరలించిన నీరు కూడా ఉండటంతో ప్రస్తుతం ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌కు చేరువలో ఉంది. దీంతో అధికారులు ఇప్పటికే ఎడమ, కుడి కాలువలకు నీటిని విడుదల చేసి.. తాగునీటి అవసరాల కోసం నిల్వ చేస్తున్నారు. మరోవైపు దీనిపై ఆధారపడిన నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటిని పంపింగ్ చేస్తున్నారు. అవన్నీ నికర జలాల ఆధారంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాలే అయినప్పటికీ.. జూరాల వద్ద ఎక్కువ నీటి నిల్వ సామర్థ్యంలో లేకపోవడంతో వరద వస్తున్న రోజుల్లోనే నీటిని ఎత్తిపోసుకుని.. ఆయా లిఫ్టుల్లో అంతర్భాగమైన రిజర్వాయర్లలో నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వరద స్వల్పంగా వస్తున్నప్పటికీ.. ఎగువన ఉన్న అంచనాల మేరకు పంపింగ్‌ను ఇప్పటికే అధికారులు ప్రారంభించారు. ఈ ఏడాది వర్షపాతం అధికంగా నమోదవుతుందని అంచనాల మేరకు ప్రాజెక్టుల పరిధిలోని రైతులు వరదపై ఆశలు పెట్టుకున్నారు. గతేడాది కృష్ణా బేసిన్ పరిధిలో వర్షాలు తక్కువగా కురవడం వల్ల ఆశించిన స్థాయిలో వరదలు రాలేదు. ఈ కారణంగా పలు ఎత్తిపోతల పథకాల కింద వానాకాలం సీజన్‌లోనే వరి పంట ఎండిపోగా.. ప్రాజెక్టుల కింద యాసంగి సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులకు కర్ణాటకలో కురిసే వర్షాలే ప్రధాన ఆదెరువుగా ఉంటాయి. ఎగువ నుంచి వరద రాకపోతే ఆయకట్టు పూర్తి స్థాయిలో సాగు కాదు. సాధారణంగా కృష్ణానదికి 90 రోజుల వరద దినాలు ఉంటాయి. జూన్ మొదటి వారంలో వరద ప్రారంభమై.. అక్టోబరు వరకు కొనసాగుతోంది. గతేడాది మాత్రం 60 రోజుల కంటే తక్కువగా వరద రోజులు నమోదయ్యాయి. ఈ కారణంగా జూరాల నుంచి మొదలుకుని.. నాగార్జున సాగర్ వరకు పంటల సాగుకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. జూరాల కింద యాసంగి సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించగా.. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వేసవిలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 1.90 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో తాగునీటి గండం తప్పింది. ప్రస్తుతం వరద వస్తుండటం.. ఎగువన వర్షసూచన ఉండటంతో త్వరగానే ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. మరో కీలకమైన ప్రాజెక్టు నారాయణపూర్‌లో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ఇప్పటికే 25.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సీజన్ ప్రారంభంలోనే నీటి నిల్వలు ఎక్కువగా ఉండటం పాలమూరు రైతులకు ఉపయోగపడుతుందని చెప్పొచ్చు.

ఆరేళ్లలో గతేడాది కనిష్ఠ వరద..

ఏటా కృష్ణానదికి భారీగా వరదలు వస్తాయి. వచ్చిన వరదకు అనుగుణంగా ప్రాజెక్టులు లేకపోవడంతో ఆ నీరంతా సముద్రం పాలవుతుంది. గడిచిన ఆరేళ్లలో గతేడాది మాత్రమే జూరాల ప్రాజెక్టుకు కనిష్ఠంగా వరద వచ్చింది. అందువల్ల కింద ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీరు వెళ్లని పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా జూన్ చివరి నాటికి ఎగువన కర్ణాటకలో ఉన్న ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండిపోతాయి. జూలై మొదటి, రెండోవారాల్లో జూరాలకు వరద వస్తుంది. అప్పటికే స్థానికంగా కురిసిన వర్షాలతో పాటు అడపదడపా ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో జూరాల ప్రాజెక్టు కూడా నిండిపోతుంది. వరద మొదలైన ఒక్క రోజులోనే జూరాల గేట్లు ఎత్తివేస్తారు. 2018లో జూరాలకు 319 టీఎంసీల నీరు రాగా.. 2019లో 1,445 టీఎంసీలు, 2020లో 1,300 టీఎంసీలు, 2021లో 893 టీఎంసీలు, 2022లో 1,230 టీఎంసీల నీరు వచ్చింది. 2023లో మాత్రం 150 టీఎంసీల నీరు జూరాల నుంచి దిగువకు వెళ్లింది. 2015 తర్వాత 2023లోనే అంత ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికే ఈ వరద సీజన్‌లో దాదాపు 30 టీఎంసీలకు పైగా కొత్త నీరు వచ్చి చేరింది. సాధారణంగా జూరాల ప్రాజెక్టుకు జూలై మొదటి వారంలో వరద వచ్చే అవకాశం ఉండగా.. ఇప్పటికే స్థానికంగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం నిండుకుండలా ఉంది. ఎగువన ఈ వారం రోజుల్లో భారీ వర్షాలు కురవకపోతే.. వరద మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం వర్షాలు ఎక్కువగా కురిస్తే వానాకాలంతోపాటు, యాసంగి పంటల సాగుకు కూడా ఢోకా ఉండదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టుల నీటి వివరాలు(నీటి నిల్వ టీఎంసీల్లో-ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో.. క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు పేరు	నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆలమట్టి	129.72	30.63	5974	430
నారాయణపూర్	37.64	25.06	234	196
ఉజ్జయిని	117.24	39.60	3204	176
జూరాల	9.66	8.670	822	2674
తుంగభద్ర	105.79	5.46	655	2008
శ్రీశైలం	215.81	37.35	686	66
నాగార్జునసాగర్	312.05	122.20	-	947
పులిచింతల	45.77	0.39	-	-

వరద వచ్చిన వెంటనే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో జూరాల ప్రాజెక్టు కింద ఉన్న 1.04 లక్షల ఎకరాల ఆయకట్టు కాకుండా.. మిగతా ఆయకట్టుకు ఎత్తిపోతల పథకాలే ఆధారం. గతేడాది కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో ఐదు పంపులకు గాను.. మూడు, నెట్టెంపాడు లిఫ్ట్ 1, 2 లిఫ్టుల్లో కేవలం ఒక్కో పంపు ద్వారా నీటిని ఎత్తిపోయగా.. వానాకాలంలోనే ఆయకట్టుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాంకేతిక సమస్యల వల్ల పూర్తి స్థాయిలో పంపులను వినియోగించడం లేదు. అయితే ఈసారి ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరులోని ఎత్తిపోతల పథకాలకు 80 టీఎంసీల వరకు నీటిని వాడుకునేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. గతేడాది వర్షాలు కురవకపోవడంతో అందులో సగం నీటిని కూడా ఎత్తిపోయలేకపోయారు. కానీ ఈసారి వరద వస్తున్నా కొద్ది నీటిని పూర్తి స్థాయిలో ఎత్తిపోసుకుంటే ఆయకట్టుకు ఇబ్బంది ఉండదు. గతంలో మాదిరిగా ఈసారి ఇష్టానుసారంగా నీటిని వినియోగించే పరిస్థితులు ఉండవని స్పష్టమవుతోంది. ప్రధాన ప్రాజెక్టులన్నీ కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) పరిధిలోకి వెళ్లడంతో కాలువలు, ఎత్తిపోతల పథకాలకు విడుదల చేస్తున్న ప్రతీ నీటి చుక్కను లెక్కకట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. గతేడాది శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఆశించిన స్థాయిలో రాలేదు. దాంతో కల్వకుర్తి ఎత్తిపోతల కింద ఉన్న ఆయకట్టులో వానాకాలంలోనే పంటలు ఎండిపోయాయి. జూరాల గేట్లు తెరిస్తేనే శ్రీశైలానికి నీరు వెళ్తుంది. అప్పుడే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోయడానికి వీలు ఏర్పడుతుంది. అయితే ఏటా రెండు తెలుగు రాష్ట్రాలు పోటీపడి ఎడమ, కుడి గట్టుల జల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి.. నీటిని దిగువకు వదులుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలా కాకుండా నీటి నిల్వల ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆయకట్టుకు ఇబ్బందులు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు దాదాపు ఎఫ్‌టీఎల్‌కు చేరువలో ఉండటంతో వరద వచ్చిన వెంటనే నీటిని శ్రీశైలానికి విడుదల చేసే అవకాశం ఉంది.



స్పౌజ్ పాయింట్లు పెట్టుకున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రవీందర్

స్పౌజ్ పాయింట్ల కోసం.. తప్పుడు సమాచారం

- విద్యాశాఖను తప్పుదారి పట్టిస్తున్న ఉపాధ్యాయులు
- 20 మంది టీచర్ల తీరుపై డీఈవో ఆగ్రహం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 23: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, మంచి సమాజాన్ని నెలకొల్పాల్సిన ఉపాధ్యాయులు తమ వరకు వచ్చిందంటే మాత్రం ఎంతకైనా దిగజారుతున్నారు. బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల వినియోగం కోసం తప్పుడు సమాచారం ఇస్తున్నారు. బదిలీలకు సంబంధించి ఆప్షన్ గడువు ముగియడంతో స్పౌజ్ పాయింట్ల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదివారం జిల్లా విద్యాశాఖకు పంపించారు. వాటిని సరి చేస్తుండగా అధికారులకు ఒక్కోటిగా తప్పిదాలు బయటపడ్డాయి. దాంతో స్పౌజ్ పాయింట్లు పెట్టుకున్న ఉపాధ్యాయులను డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి పిలిపించారు. మొత్తం 32 మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 20 మంది నమోదు చేసిన వివరాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించారు. వారిపై డీఈవో తీవ్ర ఆగ్రహం వక్తం చేశారు.

తప్పుదారి పట్టిస్తున్న ఉపాధ్యాయులు

విద్యాశాఖ నిబంధనల ప్రకారం భార్యా భర్తలు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నా, ఒకరు ఉపాధ్యాయులగా ఉండి మరొకరు ఇతర శాఖలలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నా ఎనిమిదేళ్లకోసారి బదిలీ సమయంలో స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకునే అవకాశం ఉంది. స్పౌజ్ ఉపయోగించుకునే సమయంలో నిబంధనల ప్రకారం భర్త గానీ లేదా భార్య గానీ పనిచేసే చోటుకు బదిలీ చేసుకోవచ్చు. భార్య గానీ, భర్త గానీ పనిచేసే చోటుకు అత్యంత సమీపంలో ఉన్న పాఠశాలను ఎంచుకోవాలి. కానీ కొందరు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి కాకున్నా స్పౌజ్ పాయింట్లు పెట్టుకున్నారు. అదికూడా భర్త పని చేస్తున్న స్థానం నుంచి సుమారు 35 నుంచి 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న పాఠశాల కోసం ఆప్షన్ పెట్టుకున్నారు. హెచ్‌ఆర్‌ఏ కోసం కొందరు అలా చేశారని గుర్తించారు. ఇలాంటి తప్పిదాలను గుర్తించిన డీఈవో సదరు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పట్టించుకోకుండా ఇలా చేయడం సరికాదని, తమాషాలు చేస్తే సస్పెండ్ చేసి ఇంటికి పంపుతామని హెచ్చరించారు. ఉంటే పాత స్థానంలో ఉండాలని, లేదంటే ఇద్దరూ సమీప ప్రాంతంలో పని చేయాలని ఆదేశించారు. తర్వాత నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లు వినియోగించుకున్న 20 మంది ఉపాధ్యాయుల వివరాలను నిబంధనలకు అనుగుణంగా మార్చారు. ఈ 20 మంది ఇంకేదైన తప్పులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహమ్మదాబాద్‌లో పని చేస్తే.. ధర్మాపూర్‌లో ఆప్షన్



డీఈవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

స్పౌజ్ పాయింట్లు పెట్టుకున్న సమయంలో భార్యా భర్తలు ఇద్దరూ ఒకే పాఠశాల లేదా సమీప పాఠశాలకు ఆప్షన్ పెట్టుకోవాలి. అదీ కుదరకుంటే పక్క మండలంలోని పాఠశాలలో ఆప్షన్ పెట్టుకోవాలి. కానీ మహమ్మదాబాద్ మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఒకరు ఆ మండల పరిధిలో సంబంధిత కేటగిరిలో ఖాళీలు ఉన్నా, నిబంధనలకు విరుద్ధంగా మొదటి ప్రాధాన్య ఆప్షన్‌లో మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ ఉన్నత పాఠశాలను ఆప్షన్‌గా ఎంచుకున్నారు. ఇలా చాలా మంది ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇచ్చారు. వీటన్నింటినీ డీఈవో పరిశీలించి, తొలగించారు.

సరి చేసుకోకుంటే చర్యలు

బదిలీల్లో చాలా మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్ ఇచ్చారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాం. తప్పుడు సమాచారం ఇచ్చినవారు సరి చేసుకోవాలి. లేదంటే శాఖపరమైన చర్యలు తప్పవు.

- ఎ.రవీందర్, డీఈవో

చెంచు మహిళపై దాడి అమానవీయం

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్



చెంచులతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

కొల్లాపూర్/నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 23: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నా దళిత, గిరిజనులపై ఇంకా దాడులు జరుగుతున్నాయని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళపై జరిగిన దాడి అమానవీయమని చెప్పారు. దాడి నేపథ్యంలో ఆదివారం ఆయన మొలచింతలపల్లి గ్రామంలో పర్యటించారు. ఘటన గురించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాధితురాలి నివాస గృహాన్ని, పరిసర ప్రదేశాలను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఆర్డీవో పి.నాగరాజుతో కలిసి పరిశీలించారు. భ్రమరాంబ కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జాటోతు హుస్సేన్‌నాయక్ విలేకరులతో మాట్లాడారు. చెంచు మహిళను నిర్బంధించి, కిరాతకంగా దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించేలా తీసుకుంటామన్నారు. బాధిత మహిళకు న్యాయం చేస్తామని, ఆమె కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. చెంచులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీప్రాంతాల నుంచి బహిరంగ ప్రదేశాలకు చెంచులను తరలించిన ప్రభుత్వం భూములకు పట్టాలు ఇవ్వలేదని, గృహాలు నిర్మించలేదని అన్నారు. చెంచుల జీవన స్థితిగతులు, వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమం నివేదికతో ఎస్టీ కమిషన్ నిర్వహించే సమీక్షకు హాజరుకావాలని ఆర్డీవో పి.నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్‌లను ఆయన ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కే.మహేష్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ రుషికేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కడ్తాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు పరామర్శ

దాడికి గురై, నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళను జాటోత్ హుస్సేన్‌నాయక్ కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పరామర్శించారు. ఆమెకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్ తరలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబానికి 25 ఏళ్ల కిందట ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమి, ఇంటి పత్రాలను వారి పేరుపై మార్పు చేసి, ప్రభుత్వం నుంచి రైతుబంధు అందేలా చూడాన్నారు.



ముంపు బాధితులకు పునరావాసం కల్పించేందుకు సేకరించిన స్థలం



పునరావాస కేంద్రంలో నిర్మించిన ట్యాంకు



మధ్యలోనే ఆగిన రోడ్డు నిర్మాణం



బాధితులకు పంచేందుకు విభజించిన ప్లాట్లు

పునరావాసం ఇంకెప్పుడు?

- ఎదురు చూస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులు
- ఎనిమిది నెలలుగా నిలిచిన పనులు

జడ్చర్ల, జూన్ 23: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులు పునరావాసం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ రిజర్వాయర్ కింద ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు రేగటిపట్టి తండా, చిన్నగుట్ట తండా, తుమ్మలకుంట తండా, ఒంటిగుడిసె, శ్యామగడ్డ తండా వాసులు ముంపునకు గురవుతున్నారు. వారికి పునరావాసం కల్పించేందుకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం సమీపంలో జడ్చర్ల మండలం దేవునిగుట్ట తండాకు వెళ్లే దారిలో 299 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. భూమిని చదును చేసి, రాళ్లను తొలగించింది. నిర్వాసితులకు 300 గజాల చొప్పున ప్లాటును కేటాయించేలా లే అవుట్‌ను తయారు చేయించారు. కానీ, ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో తమకు పునరావాసం ఎప్పుడు కల్పిస్తారా? అని బాధితులు పడిగాపులు కాస్తున్నారు.

299 ఎకరాల భూసేకరణ..

ముంపు బాధితులకు పునరావాసం కల్పించేందుకు చేపట్టిన భూసేకరణలో అవకతవకలు జరిగాయని, పట్టాదారులకు బదులుగా ఇతరులకు నష్టపరిహారం అందించారంటూ పట్టాదారులు పలు పర్యాయాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళనలు కూడా చేయడంతో సేకరించిన భూమిలో అభివృద్ధి కార్యక్రమాలు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. సేకరించిన 299 ఎకరాల భూమిలో 300 గజాల స్థలం చొప్పున 2,850 ప్లాట్లుగా లేఅవుట్‌ను తయారు చేయించారు. 280 ఎకరాలలో చేపట్టిన లేఅవుట్‌లో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో మూడు తండావాసులకు, మిగిలిన 19 ఎకరాలలో రెండు తండాల ముంపు బాధితులకు ప్లాట్లు కేటాయించేలా లేఅవుట్ రూపొందించారు. భూమి లెవలింగ్ పనులు, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పాఠశాల భవనాలు, వాటర్ ట్యాంకులు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి పునరావాస కమిషనర్ సుమారు రూ.172 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఆ నిధులతో వాటర్ ట్యాంకులను నిర్మించారు. కొంత మేర రోడ్లు వేయడంతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే పునరావాస కేంద్రంలో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సుమారు రూ. 1,000 కోట్ల బడ్జెట్ అవసరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడు వాటర్ ట్యాంకులు, మట్టి రోడ్లు మాత్రమే నిర్మాణం

పునరావాస కేంద్రం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రస్తుతం మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు 10 కిలో మీటర్ల మేర డ్రైనేజీ, ఒక కిలో మీటర్ మేర రోడ్డు నిర్మాణాలు మాత్రమే చేపట్టారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినా, తీగలు బిగించలేదు. ఇంకా సుమారు 21 కిలో మీటర్ల రోడ్లు, 61 కిలో మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే ఐదు పాఠశాల భవనాలు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక వెటర్నరీ భవనం, ఆరు కమ్యూనిటీ భవనాలు, రెండు ఫంక్షన్‌హాల్స్‌తో పాటు రెండు షాపింగ్‌మాల్స్, వివిధ మతాలవి 33 దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు నిర్మించాల్సి ఉంది. అదే విధంగా రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు బస్ షెల్టర్లు, రెండు క్రిమిటోరియంలు, రైతు వేదికలు, పార్కులు, ఐదు వాటర్ ట్యాంకులు, ఒక వాటర్ సంపు నిర్మించాల్సి ఉంది.

రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు



మధ్యలోనే ఆగిన డ్రైనేజీ నిర్మాణం

ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపువాసులకు కల్పించాల్సిన పునరావాస కేంద్రంలో రెండు సంవత్సరాలుగా అభివృద్ధి పనులు సాగుతూనే ఉన్నాయి. ఉదండాపూర్, వల్లూరు గ్రామాల ముంపువాసులకు కల్పించే పునరావాసంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.56.23 కోట్లు మంజూరు అయ్యాయి. ఆ పనులకు 2022 జూన్ 15న అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పనులను ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయించి, ప్లాట్లను అందచేయనున్నట్లు వారు వెల్లడించినా, నేటికీ పూర్తి కాలేదు. ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోయాయి.





నాడు మోడుబారి.. నేడు చిగురించి

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి సోమశిలకు వెళ్తున్న దారిలోని గుట్టలపై గల చెట్లు ఏప్రిల్, మే నెలల్లో ఎండలకు ఎండిపోయాయి. కళావిహీనంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలకు చెట్లన్నీ చిగురిస్తున్నాయి. ఆకుపచ్చగా మారి కళకళలాడుతున్నాయి. ఈ దారిలో సోమశిలకు వెళ్తున్న ప్రయాణికులు, పర్యాటకులు పచ్చదనాన్ని చూసి పరవశించిపోతున్నారు.

- పెంట్లవెల్లి

నేడు డిప్యూటీ సీఎం రాక

- భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో జెన్‌కో అధికారులతో సమీక్ష

దోమలపెంట, జూన్ 23: శ్రీశైలం రెండో భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరిశీలించనున్నట్లు జెన్‌కో సీఈ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీశైలం దర్శనం అనంతరం మధ్యాహ్నం జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తారని చెప్పారు. అక్కడే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులతో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని సీఈ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో వాహనాలు

ఊర్కొండ, జూన్ 23: ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'మిషన్ భగీరథ ట్యాంకులను భద్రతేదీ?' అనే కథనానికి స్పందించిన పోలీసులు హనుమాం ఢ్ల గుట్టపై ఉన్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో గ్రామస్థులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుట్టపై దళారుల స్వాధీనంలో ఉన్న క్వారీల వద్ద నుంచి వాహనాలను పోలీసుల రాకను ముందు పసిగట్టి అక్కడినుంచి తీసుకు వెళ్లారు, అయినప్పటికీ పోలీసులు చాకచక్యంగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేష న్‌కు తరలించారు. రెవెన్యూ, విద్యుత్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు

జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి

- జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేట్ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 23 : జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి జిల్లా అసోసియేషన్ కృషి చేస్తుందని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి అన్నారు. వరల్డ్ హ్యాండ్‌బాల్ డేను పురస్క రించుకొని ఆదివారం స్టేడియం మైదానంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్‌లో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. ప్రతిభ గల


ప్రపంచ హ్యాండ్‌బాల్ డే వేడుకలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, ఉపాధ్యక్షులు అనిల్‌కు మార్, అబ్దుల్‌ఖలీం, బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌హుస్సేన్, కోచ్‌లు ప్రదీప్ కుమార్, నర్సింహ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు


జడ్చర్ల మండలం నెక్కొండ శివారులో చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

జడ్చర్ల, జూన్ 23 : జడ్చర్ల మండలంలోని నెక్కొండ గ్రామ శివారులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. నెక్కొండ నుంచి లింగంపేటకు వెళ్లే అడ్డదారిలోని వ్యవసాయపొలాల్లో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కేవలం నాలుగు నుంచి ఐదు ఫీట్ల ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో అటువైపుగా వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌తీగలను సరి చేయాలని, ప్రాణనష్టం వాటిల్లకముందే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయపొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్‌తీగలు ఉన్నాయంటూ రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని విద్యుత్‌శాఖ జడ్చర్ల ఏఈ కిరణ్ తెలిపారు. వ్యవసాయపొలాల్లో ఉన్న ఇలాంటి తీగలను సరిచేసేందుకు బడ్జెట్ అవసరం ఉంటుందని, ప్రతిపాదనలను పంపిస్తామని చెప్పారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- ఏళ్లు గడుస్తున్నా సీసీకి నోచుకోని రహదారులు

- అలంపూర్ పట్టణ, గ్రామీణ ప్రజలు అవస్థ


అలంపూరు పట్టణలోని కట్టెలపేట వీధి రోడ్డు దుస్థితి

అలంపూరు జూన్ 23: అలంపూరు మునిసిపాలిటీగా ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఎంతో ఆశించారు. కానీ, అవి అడియాశలేయ్యాయి. పలు రహదారులు అధ్వానంగా మారడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్ల గుండా ఎలా నడవాలి? వాహనాలు ఎట్లా నడుపాలని తలలు పట్టుకుంటున్నారు. అనేక పర్యాయాలు తమ వీధి రోడ్లను మరమ్మతు చేయాలని మొరపెట్టుకున్నా ఆలకించేనాథుడే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. కన్యకాపరమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుపై మురుగు, వర్షపు నీరు వెళ్తుండటంతో కోతకు గురైంది. ఈ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సైతం సరిగ్గా లేదు. న్యూప్లాట్స్ కాలనీలో అంతర్గత రహదారులు సరిగ్గా లేవు. మిషన్ భగీరథ పైపు లైన్ వేసే సమయంలో తవ్వి అలాగే వదిలేశారు. చౌక్ బజారు నుంచి సంతోష్‌నగర్ వైపు వెళ్లే దారి సైతం చాలా మేరకు గుంతలు పడ్డాయి. రాత్రివేళలో, వర్షం కురిసిన సమయాల్లో ఈ వీధుల గుండా వెళ్లటం కష్టంగా మారింది. చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరైనా గుత్తెదారు తప్పుకున్నాడు. ప్రభుత్వం మారింది. అప్పటి ప్రభుత్వలో మంజూరైన పనులు చేస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అక్బర్ పేట్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉన్నా అలాగే వదిలేశారు. అలాగే మండల పరిధిలోని క్యాతూరు, బుక్కాపురం, ఉట్కూరు, భీమవరం, కాశాపురం గ్రామాల్లో, మేజర్ గ్రామ పంచాయతీ లింగనవాయిలోని 1, 2, 10వ వార్డుల్లో ఇంత వరకు సీసీ రోడ్లకు నోచుకోలేదు. ప్రధాన రోడ్లపై కంకర రాళ్లు తేలి, గుంతలుగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల ముందు వర్షం నీరు నిలిచి చిత్తడిగా మారింది. దుర్వాసన వెదజల్లుతుండటంతో ఈగలు, దోమల వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి పాటు పడాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు ఇచ్చి మరిచిపోతారు



ఎందరు సర్పంచులు మారినా తమ వీధుల రోడ్లు మాత్రం మారలేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా తమ వీధుల్లో రోడ్లు వేయాలని విన్నవించినా అప్పుడు మాత్రమే హామీ ఇస్తారు. తరువాత మర్చిపోయి వారికి అనుకూలమైన వీధుల్లో సీసీ రోడ్లను మంజూరు చేయిం చుకుం టున్నారు. మా వీధులను ఎందుకు పట్టించుకో వడం లేదు? సీసీ రోడ్డు వేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నా.

- సుంకులమ్మ, లింగనవాయి గ్రామం

అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది



అభివృద్ధికి ఆమడ దూరంలో అలంపూరు ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత సరిహద్దు ప్రాంతాలు మాత్రం నేటికీ అభివృద్ధి చెందలేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు పరిస్థితి అధ్వానంగా మారాయి. వీటికి మోక్షం ఎప్పుడు వస్తుందో తెలియదు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు, నూతన ప్రభుత్వం చేయకుండా గ్రామీణుల సమస్యలపై దృష్టి సారించాలి.

- జీకే ఈదన్న జోగుళాంబ గద్వాల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

నిధులు రాగానే పూర్తి చేస్తాం

అంతర్గత రహదారులకు నిధులు మంజూరు కాగానే తప్పనిసరిగా నిర్మిస్తాం. గుత్తెదార్లకు బిల్లులు రాకపోవడంతో, సీసీరోడ్ల నిర్మాణానికి ఎవరు ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- మేఘనాథ్, ఏఈ, అలంపూర్

ఇండో - నేపాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో యువకుడి ప్రతిభ

- 400 మీటర్ల పరుగు పందెం పోటీలో బంగారు పతకం



నేపాల్‌లో జరిగిన పోటీలో బంగారు పతకం అందుకుంటున్నా మీస గణేష్

ఊట్కూర్, జూన్ 23 : నేపాల్ దేశంలోని ఫోఖ్ర స్టేడియంలో జూన్ 20 నుంచి 24వరకు నిర్వహించే యూత్ గేమ్స్ ఇండో - నేపాల్ చాంపియన్‌షిప్ - 2024 పోటీల్లో నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామానికి చెందిన మీస గణేష్ ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల పరుగు పందె పోటీలో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించి గ్రామం పేరును ప్రపంచ స్థాయిలో నిలబెట్టారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన గణేష్ ఫిట్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం సాధించి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అనంతరం నేపాల్ దేశంలో జరిగిన పోటీల్లో కూడా పాల్గొని విజేతగా నిలవడంతో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, ఊట్కూర్ మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మణెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వీరరాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణార్జున్‌రెడ్డి గణేష్ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

కోయిలకొండ, జూన్ 23 : నేపాల్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో కోయిలకొండ మండలంలోని వింజమూరుకు చెందిన నర్సింహులు 200 మీటర్ల పరుగుపందేంలో బంగారు పతకం సాధించాడు. బంగారు పతకం సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె

చారకొండ, జూన్ 23: మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన బండ్ల లక్ష్మమ్మకు చెందిన గేదె ఆదివారం వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని పశు వైద్యాధికారులకు తెలప డంతో వైద్యాధికారులు మృతి చెందిన గేదెను పరిశీలించారు. దాని విలువ రూ. 40 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు బండ్ల లక్ష్మమ్మ కోరారు.

పదరలో..

అమ్రాబాద్: పదర మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య అనే రైతుకు చెందిన పాడి ఆవు ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు మేత మేస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వ నుంచి ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

గుమ్మడం గ్రామంలో


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

పెబ్బేరు రూరల్ : మండలంలోని గుమ్మడం గ్రామంలో హైటెన్షన్ విద్యుత్ వైరు 10 రోజుల క్రితం కింద పడిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపిన నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆదివారం గ్రామానికి చెందిన గొల్ల రాముడుకు ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి కిందపడిన వైరును సరిచేసి ఉంటే ఈ రోజు నా ఆవు మృతిచెదేది కాదని వారు ఆరోపించంఆరు. రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని పలవురు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతానికి గురైన నెమలికి చికిత్స


గాయపడిన నెమలికి వైద్యం చేస్తున్న పశువైద్య సిబ్బంది

కల్వకుర్తిటౌన్, జూన్ 23 : విద్యుదాఘాతానికి గురైన నెమలికి గుర్తించి చికిత్స అందించిన కొద్దిసేపటికే మరణించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మహబూబ్‌నగర్ నుంచి కల్వకుర్తికి వచ్చే సమయంలో పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో బస్సుటాప్‌పై పెద్ద శబ్దం రావడంతో బస్సును ఆపి గమనించగా, నెమలి విద్యుత్తు తీగలకు తగిలి గాయపడింది. గమనించిన ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా వారు అటవీ శాఖవారికి సమాచారం ఇచ్చి వెటర్నీ వైద్యుడితో చికిత్స అందించారు. చికిత్స పొందిన కొద్దిసేపటికే మరణించిందని వారు తెలిపారు. మృతి చెందిన నెమలిని అటవీశాఖ పోలీసులకు అప్పగించారని వారు పేర్కొన్నారు.

రెండు విద్యుత్ మోటార్లు చోరీ

వంగూరు, జూన్ 23: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. గ్రామానికి చెందిన సలేశ్వరం, కోట్ల ప్రశాంత్‌రావు పొలాల వద్ద బోర్లకు బిగించిన విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఆదివారం ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చినుకు పడిందంటే చాలు చిత్తడే..

- తండావాసులకు తప్పని తిప్పలు


బురదమయంగా మారిన జమ్లానాయక్ తండా- పర్దీపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

చిన్నచింతకుంట, జూన్ 23 : మండలంలోని పర్దీపూర్‌తండాల గ్రామ శివారులోని తవడాలు అభివృద్ధికి నోచుకోవటం లేదు. దాంతో తండాల్లో సమస్యలు సమస్యలుగానే మిగిలాయి. నిత్యం తండావాసులు తమ అవసరాల నిమిత్తం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్దీపూర్ గ్రామానికి రావాల్సిందే. తండాలకు మట్టిరోడ్డు కూడా సక్రమంగా లేదు. దీంతో వర్షాకాలంలో నాలుగు చినుకులకే తండారోడ్డు చిత్తడి చిత్తడిగా మారుతుంది. రెడ్యానాయక్ తండా, పర్దకుంట తండా, మాల్యా నాయక్, జమ్లా నాయక్ తండాలు సంబంధించి రహదారి అంతా బురదమయంగా మారింది. నిత్యావసర సరుకుల నిమిత్తం పర్దీపూర్ గ్రామానికి వెళ్లాలన్నా, ఆ బురదనీటిలోనే వెళ్లాల్సిందే. కనీసం కాలుపోపలేని విధంగా బురదగుంతల్లోనే కాలినడన పోవాల్సిందే. అత్యవసర పరిస్థితిలో, రాత్రి సమయంలో రహదారిపై పోలేని పరిస్థితి ఉంది. ఇక జ్వరమొస్తే మాత్రం బురదల్లోనే రోగిని తీసుకుని స్థానిక ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లాలన్నా, వెళ్లలేని పరిస్థితి నెలకొందని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామం నుంచి ఇతర గ్రామాలకు పోవాలన్నా, కాలుమోపలేని విధంగా రహదారి మారుతుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా బీటీ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపగా, మంజూరైందని సంబంధిత అధికారి డీఈ అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రతిభకు పదును

- ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా
- జాతీయస్థాయికి పోటీలకు 52 మంది క్రీడాకారులు
- రాష్ట్రస్థాయి పోటీలకు అతిథ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 23 : రాష్ట్ర స్థాయి క్రీడలకు మహబూబ్‌నగర్ జిల్లా వేదికైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదు. క్రీడాకారులు ఉన్న వనరులతోనే రాష్ట్ర జాతీయ స్థాయికి ఎదిగారు. పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీల్లో అద్భుత ప్రతిభ చాటారు. కొవిడ్ కారణంగా నిలిచిన పోటీలు నాలుగేళ్ల తర్వాత 2023-24 విద్యా సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాయి. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తాచాటారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నీలకు ఎంపికై ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చాటారు. టోర్నీలో జిల్లా పలు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయిలో విజేతగా, రన్నర్‌గా ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు నిలిచింది.

రాష్ట్రస్థాయి పోటీలకు వేదిక

మహబూబ్‌నగర్ జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగు రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణకు అవకాశం దక్కింది. 2023 అక్టోబర్‌లో 19 నుంచి 21 వరకు అండర్-17 వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నీలో జడ్చర్ల నియోజవర్గంలోని రాజాపూర్‌లో నిర్వహించారు. ఈ టోర్నీ మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు చాంపియన్‌గా నిలిచింది. డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు అండర్-17 ఫుట్‌బాల్ జడ్చర్లలో నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. 2024 జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో అండర్-17 హ్యాండ్‌బాల్ బాల, బాలికల టోర్నీ నిర్వహించారు. టోర్నీ జిల్లా బాలుర జట్టు రజత, బాలికల జట్టు కాంస్య పతకాలు సాధించింది. ఫిబ్రవరి 26 నుంచి 29వ తేదీ వరకు అండర్-14 ఎస్‌జీఎఫ్ బాలుర క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జట్టు కాంస్య పతకం సాధించింది.

ఎస్‌జీఎఫ్ టోర్నీలో క్రీడాకారుల ప్రతిభ

ఎస్‌జీఎఫ్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటారు. జాతీయ స్థాయి పోటీలకు 52 మంది క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో ఎంపికయ్యారు. వాలీబాల్-6, సాఫ్ట్‌బాల్- 8, రగ్బీ-7, హ్యాండ్‌బాల్-7, బాస్కెట్‌బాల్-4, ఫుట్‌బాల్-5, క్రికెట్-5, హాకీ-2, అథ్లెటిక్స్-6, కబడ్డీ-1 మొత్తం అండర్-14, 17 విభాగాల్లో 52 మంది బాల, బాలికలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటారు.

వారికి భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోటా దక్కనుంది.


రాష్ట్రస్థాయి అండర్-17 : ఫుట్‌బాల్ బాలుర విజేత మహబూబ్‌నగర్ జట్టు(ఫైల్)

ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం



2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలో నాలుగు రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించాం. జిల్లాలో పలు టోర్నీలలో విజేతగా, రన్నర్‌గా నిలిచిచాయి. 52 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తాం. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు మహబూబ్‌నగర్‌లో నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం.

- రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రైతు రుణమాఫీపై విమర్శలా ?

- పందికొక్కుల్లా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నాయకులు
- ఏకకాలంలో రుణమాఫీ చేసి తీరుతాం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 23 : అధికారంలో ఉన్నన్ని రోజులు పందికొక్కుల్లా దోపిడీకి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణం మాఫీ చేస్తుంటే విమర్శలు చేయడం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో రైతులంతా ఎంతో ఆనందంలో ఉన్నారని, బీఆర్ఎస్ నాయకులు మాత్రం రైతులను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టినా, పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా చేసినా ఆ పార్టీకి ఇంకా బుద్ధిరాలేదని ఎద్దేవా చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేబినెట్ నిర్ణయం తీసుకుంటే అది శాసనమని, అవే జీఓల రూపంలో వస్తాయని, రాజకీయాలపై కనీస పరిజ్ఞానం ఉన్న వ్యక్తులకు కూడా ఈ విషయం అర్థమవుతుందన్నారు. మరి మంత్రిగా పనిచేసిన నిరంజన్‌రెడ్డి కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటే రుణమాఫీ అవుతుందా అని మాట్లాడటం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.31 వేల కోట్ల రుణాలను ఒకే విడతలో రైతులకు 2 లక్షలు మాఫీ చేయాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ రెండు పర్యాయాలు అధికారంలో ఉండి రుణమాఫీ చేసింది కేవలం రూ.28 వేల కోట్లని, అది కూడా విడతల వారీగా మాఫీ చేయడం వల్ల మిత్తీలకే మాఫీ డబ్బులు సరిపోయాయని పేర్కొన్నారు. దానివల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని ఎద్దేవా చేశారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీకి నిధులు సర్దుబాటు చేసిన తరువాతనే ఏకకాలంలో రుణమాఫీ చేయాలని నిర్ణయించారని తొందరలోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతుల కోసం పనిచేసే ప్రభుత్వమని నాడు వైఎస్ హయాంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని, మళ్లీ రేవంత్ హయాంలో రైతులకు పెద్దఎత్తున రుణాలు మాఫీ కాబోతున్నాయని, ఇది కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, ఏపీ మిథున్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

25 నుంచి భారత నెట్‌బాల్ మహిళా జట్టుకు శిక్షణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 23 : సౌది అరేబియాలోని రియాద్‌లో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని భారత మహిళా జట్టుకు ఈ నెల 25 నుంచి శి క్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్ ఆదిత్యారెడ్డి, ఖాజాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 24 మందితో ప్రాబబుల్స్ ఎంపిక చేశామని, శిక్షణ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తుది జట్టుకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. మొదటి విడత శిక్షణ మహబూబ్‌నగర్ ఇండోర్‌స్టేడియం ఉంటుందని తెలిపారు.

చీటి డబ్బులు ఇవ్వని చిట్‌ఫండ్‌పై కేసు నమోదు

జడ్చర్ల, జూన్ 23 : జడ్చర్ల పట్టణంలోని క్లబ్‌రోడ్డులోని మిత్రోదయ చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో చీటీలు వేయించుకుని, చీటి డబ్బులు ఇవ్వడంలేదంటూ బాధితుడు చెర్లకోల సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ శివానందం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచ గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మిత్రోదయ చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.10లక్షలకు సంబంధించిన రెండు చీటీలు వేశాడు. చీటి డబ్బులను వాయిదాలు వేస్తూ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కాగా ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా చిట్‌ఫండ్స్‌ను నిర్వహిస్తున్నారంటూ కూన సంతోష్, మంద రాజవర్ధన్‌రెడ్డి, గోపిరెడ్డిలపై ఫిర్యాదు చేసాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై పరిశీలన


ఈర్లపెంటలో చెంచు చిన్నారి తండ్రికి కౌన్సెలింగ్ ఇస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది

మన్ననూర్, జూన్ 23: నల్లమల అభయారణ్య ప్రాంతంలోని ఈర్లపెంటలో రక్తహీనతతో బాధపడుతున్న నాలుగు నెలల చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏరియా అధికారి ఆదివారం ఆర్డీటీ సయన్వయకర్తలతో కలిసి నల్లమలలో పర్యటించారు. ఈ నెల 16న రక్తహీనతతో బాధపడుతూ నిమ్మల గురువమ్మ అనే చెంచు మహిళ మృతి అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వగా, ఐసీడీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈర్లపెంటను సందర్శించి నాలుగు నెలల చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. శిశువు ఆరోగ్య స్థితిని పరిశీలించగా నెలలకు తగిన బరువు లేదని, రెండు నెలలు జిల్లా కేంద్రంలో శిశువుకు తగిన చికిత్స అందించి, కావాల్సిన పౌష్టికాహారం అందజేస్తామని, శిశువు బాధ్యతను స్త్రీ శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని చిన్నారి తండ్రి గురువయ్యకు అవగాహన కల్పించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలోచించుకొని రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని శిశు సంరక్షణ అధికారికి చెప్పాడు. శిశువుకు కావాల్సిన పాల ప్యాకెట్లను ఆర్డీటీ సంస్థ అర్గనైజర్లు వెంకటేశ్, నవీన్ అందజేశారు. శిశువుకు అవసరమైనన్ని పాల ప్యాకెట్లను తమ సంస్థ ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూరు, జూన్ 23 : మండలంలోని నేరడుగం గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ఆదివారం తెల్లవారుజామున అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన బొక్కల మారెప్పతో పాటు సొంటి రవి డ్రైవర్, ట్రాక్టర్ ఓనర్ బుక్కల నర్సప్పపై కేసు నమోదు చేశారు. అదే విధంగా నేరడుగం గ్రామానికి చెందిన బొందల కుంట రాజశేఖర్‌రెడ్డి ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల, జూన్ 23 : జడ్చర్ల మునిసిపాలిటీలోని చెట్టుకొమ్మలను తొలగిస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ జడ్చర్ల ఏఈ కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాదేపల్లి 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కెవి లైన్‌పై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు కార్యక్రమం సందర్బంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాతబజారు, పద్మావతికాలనీ, క్లబ్‌రోడ్డు, ఎల్ఐసీ ఆఫీస్‌రోడ్, తహసీల్ కార్యాలయం రోడ్, బురెడ్డిపల్లి రోడ్డు, మటన్‌మార్కెట్, విద్యానగర్‌కాలనీ, అయోధ్యనగర్ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిగ్నల్‌గడ్డ, నేతాజీచౌక్, కల్వకుర్తి రోడ్డు, గౌరీశంకర్ కాలనీ, దేవీటాకీస్ రోడ్డు, సరస్వతికాలనీ, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.30 కోసం మూడు కత్తిగాట్లు

- పాన్‌డబ్బా వద్ద జరిగిన గొడవలో నలుగురి రిమాండ్ - వివరాలు వెల్లడించిన టూటౌన్ సీఐ



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ స్వామి, చిత్రంలో నిందితులు

మహబూబ్‌నగర్, జూన్ 23 : సిగరెట్లు తీసుకుని రూ.30 ఇవ్వకుండా వెళ్లిపోయిన వ్యక్తులను డబ్బులు ఇవ్వాలని అడగడంతో మాటామాట పెరిగి చివరకు కత్తులతో దాడి చేసే వరకు వెళ్లింది. ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు దాడిలో పాల్గొన్న నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. టూటౌన్ సీఐ స్వామి వివరాల ప్రకారం... పట్టణంలోని న్యూటౌన్‌లో ఉన్న పాన్‌మహల్‌లో వీరన్నపేటకు చెందిన సాహిల్ ఈ నెల 21న సిగరెట్లు తీసుకుని రూ.30 చెల్లించకుండా వెళ్లిపోయాడు. ఆ సమయంలో కౌంటర్‌పై ఉన్న అవైజ్ బిన్ అబ్దుల్లా కొద్దిసేపటికి షాప్‌కు వచ్చిన తన అన్న పయాజ్‌బిన్ అబ్దుల్లాకు విషయం చెప్పడంతో అతను సాహిల్‌కు ఫోన్ చేసి గట్టిగా డబ్బులు అడగడంతో అతను పాన్‌మహల్ వద్దకు వచ్చి గొడవపెట్టుకున్నాడు. మాటామాట పెరగడంతో సాహిల్ తన సోదరుడికి ఫోన్ చేయడంతో అతను మరో ముగ్గురు కలిసి వచ్చి అవైజ్ బిన్ అబ్దుల్లాపై కత్తులతో మూడుచోట్ల గాట్లు వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు ఆదివారం వీరన్నపేటకు చెందిన అమీన్, మహ్మద్ జమీరుద్దీన్, సాహిల్, మర్లుకు చెందిన సమీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో నిందితుడు ఖలీల్ పరారీలో ఉన్నాడు. నిందితులపై సెక్షన్ 307, 323, 504 రెడ్‌విత్ 34 ఐపీసీ, 21(ఏ) ఆర్మ్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లు ఎప్పుడు నిలుపుతారో?

- రెండు నెలల క్రితం రద్దయిన ప్యాసింజర్ రైళ్లు
- ఇబ్బంది పడుతున్న గ్రామీణులు

ఇటిక్యాల, జూన్ 23 : రైల్వేశాఖ ప్రధాన మార్గాల పునరుద్ధరణ, విస్తరణ కారణంగా ప్యాసింజర్ రైళ్ల రద్దు కావడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు అవస్థ తప్పడం లేదు. వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగించడానికి అనువుగా ఉండే కర్నూలుసిటీ నుంచి కాచిగూడకు వెళ్లే ప్యాసింజర్ రైలు రద్దు కారణంగా ఉపాధి, విద్య కోసం ఇటిక్యాల రైల్వే స్టేషన్ నుంచి గద్వాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఇటు కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు నెలల క్రితం దేవరక్రద- మన్యంకొండ రైల్వే లైన్ల పునరుద్ధరణ, విస్తరణ పనుల కారణంగా కర్నూలు సిటీ నుంచి కాచిగూడ వెళ్లే ప్యాసింజర్ రైలు 17436, గుంతకల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ప్యాసింజర్ రైలు 07671, సికింద్రాబాద్ నుంచి గుంతకల్‌కు వెళ్లే ప్యాసింజర్ రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేశారు. నాటి నుంచి మానవపాడు, ఇటిక్యాల, వల్లూరు, పెద్దదిన్నె, పూడూరు ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆయా పట్టణాలకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గుంటూరు నుంచి సికింద్రాబాదు, సికింద్రాబాదు నుంచి గుంటూరు వెళ్లే రైళ్లు తప్ప మిగతా రైళ్లు ఆయా స్టేషన్లలో ఆపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా కంటే ముందు ఇటిక్యాల రైల్వేస్టేషన్‌లో ఆరు రైళ్లు ఆగేవని, నేడు కేవలం గుంటూరు నుంచి కాచిగూడ, కాచిగూడ నుంచి గుంటూరు వైపు వెళ్లే రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని, ఇటీవల హంద్రీఎక్స్‌ప్రెస్ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆపుతుండడంతో కొంత వెసులుబాటు కలుగుతుందని వారంటున్నారు. ఇటిక్యాల రైల్వే స్టేషను ఉండటం వల్ల రాజోలి, వడ్డేపల్లి, అయిజ, ఇటిక్యాల మండల్లాలోని గ్రామాల ప్రజలకు ఇటిక్యాల రైల్వేస్టేషనులో రైళ్లు నిలిపితే ఎంతో సౌకర్యంగా ఉంటుందంటున్నారు. గ్రామీణ ప్రజల సమస్యలపై రైల్వే అధికారులు దృష్టి సారించాలన్నారు.


ఇటిక్యాల రైల్వేస్టేషన్

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పేరుతో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆయా పట్టణాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్యాసింజర్ రైళ్ల రద్దు కారణంగా సకాలంలో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడం లేదు. వ్యాపారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. రైల్వే అధికారులు గ్రామీణ ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి.

- సాయిబాబ, వ్యాపారి ఇటిక్యాల

రైలే మాకు దిక్కు



మా గ్రామానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. రైళ్లే మాకు దిక్కు. ప్యాసింజర్ రైళ్లు రద్దు కారణంతో పెద్దదిన్నె నుంచి ఇటిక్యాలకు కాలినడకన వెళ్లే ప్రైవేట్ వాహనాల్లో గద్వాల, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. గతంలో ఉదయం, సాయంత్రం వేళలో పెద్దదిన్నెలో ప్యాసింజర్ రైళ్లు ఆపుతుండడంతో అందరికీ సౌకర్యవంతంగా ఉండేది. రెండు నెలల నుంచి ప్రయాణం చేయాలంటే ఆలోచించి వెళ్లాల్సి ఉంది.

- నరసింహ, పెద్దదిన్నె

ఘనంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వాత్సల్య అనాథాశ్రమంలో చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 23: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ చౌరస్తాలో వాత్సల్య అనాథాశ్రమంలో తన సతీమణి కూచకుళ్ల సరితతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంతో 175 మంది రక్తదానం చేశారు. అనంతరం కూచకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సరిత దంపతులు వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, మండల నాయకులు వెంకటస్వామి, రాంచందర్, రామకృష్ణ, అమృత్ రెడ్డి, మాన్యానాయక్, హరీశ్వర్ రెడ్డి, భగవంత్ గౌడ్, ఈశ్వర్, జయకృష్ణ, ఖలీల్, శ్రీనివాస్ గౌడ్, మిద్దె బాల్‌రాజు, కుమ్మరి బాబు, వెంకటయ్య ఉన్నారు.

● తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు తిమ్మాజిపేట మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అదేవిధంగా మరికల్ గ్రామంలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వికలాంగుల ఆశ్రమంలోనూ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కాంగ్రెస్ నాయకులు

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. స్థానిక మార్కెట్ యార్డులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి ముందు మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ నాయకులు ఎం.బాలగౌడ్, మామిళ్లపల్లియాదయ్య, వారణాసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై పర్యాటకులకు అవగాహన



శ్రీశైలం వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న అటవీ అధికారులు

మన్ననూర్, జూన్ 23: ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దే క్రమంలో జూలై1 నుంచి ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేసేందుకు మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద పర్యటకులకులకు అటవీ అధికారులు వారం రోజుల ముందుగానే అవగాహన కల్పిస్తున్నారు. అటవీ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) క్షితిజ వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్లాస్టిక్ నిషేధంపై సందేశాలను పంపుతున్నారు. స్థానిక రేంజ్ , సెక్షన్, బీట్, టైగర్ ప్రొటెక్షన్ వాచర్ల ఆధ్వర్యంలో శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. జూలై 1నుంచి నిబంధనలను అతిక్రమించి అడవీ రహదారి మార్గంలో ప్లాస్టిక్ కవర్లు, సీసాలు పాడేస్తే అటవీశాఖ జరిమానాలు విధిస్తుందని పర్యటకులకు ఆదివారం అవగాహన కల్పించారు. బీట్ అధికారి వెంకటేష్, సేకరణ సిబ్బంది హరీష్, వెంకటేష్, ఇలియాస్ పాల్గొన్నారు.

నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా

మన్ననూర్, జూన్ 23: నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్, పదర మండలాలకు నాలుగు రోజులుగా పదర, అమ్రాబాద్ మండలాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీలో పని చేసే నీటి సరఫరా సిబ్బందికి అధికారులకు ఫోన్ చేస్తున్నా సంబంధిత అధికారులు కారణాలు చెప్పడం లేదు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు తాత్కాలికంగా పాత విధానంలో స్థానిక రక్షిత నీటి బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలి'

తిమ్మాజిపేట, జూన్ 23 : తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజీపల్లి పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు తరగతులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, మరోపోస్టు మంజూరు చేయించాలని కోరామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరలో డిప్యూటేషన్ ద్వారా ఉపాధ్యాయున్ని సర్దుబాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి స్పందిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అంతకు ముందు సభ్యులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

ఉప్పునుంతల, జూన్ 23 : జిల్లాలోని వంగూరు, ఉప్పునుంతల మండలంలోని దుందుభీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆదివారం బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు కలెక్టర్ బదావత్ సంతోషకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఉప్పునుంతల మండలంలోని మొల్గర, పెద్దాపూర్, వంగూరు మండలంలోని ఉల్పర సమీపంలోని దుందుభీ వాగు నుంచి రోజూ వందల కొద్దీ టిప్పర్లతో ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నా సంబంధింత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దుందుభీ వాగు ఆధారంగా రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొన సాగిస్తున్న రైతుల పొట్ట కొడుతు న్నారని వారు అన్నారు. వెంటనే కలెక్టర్, యం త్రాంగం జోక్యం చేసుకొని ఇసుక దందాను నిలిపివేయాలని కోరారు. మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఆదేశాలివ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు.

నేడు అవగహన సదస్సు

కల్వకుర్తిటౌన్, జూన్ 23: మండలంలోని మార్చాల గ్రామంలో నేడు ఉద్యాన పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగహన సదస్సును రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు ఉద్యనశాఖ అధికారిని హిమ్రానా ఒక ప్రకటనలో చెలిపారు. ఉదయం 10 గంటలకు రైతువేదికలో అవగహన సదస్సులో ఆయిల్‌పామ్ పంటపై శిక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, అయిల్‌పామ్ ఈ ప్రాంత అధికారులు, హాజరౌతారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని, వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆమె తెలపారు.

అసంపూర్తిగా..

- డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు
- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- పనులు పూర్తికాక గృహ ప్రవేశాలు వాయిదా
- ఏడాది కాలంగా ఎదురుచూపులు

కల్వకుర్తి, జూన్ 23 : కల్వకుర్తి పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. లబ్ధిదారులను గుర్తించి ప్లాట్లు కేటాయించినప్పటికీ అసంపూర్తి పనుల మూలంగా గృహ ప్రవేశాలు జరగలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేసి అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

మిగిలిన విద్యుత్, వాటర్‌వర్క్ పనులు

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని 99 సర్వే నెంబరులో గత ప్రభుత్వం 240 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది. నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండగానే 2023 మే ఐదో తేదీన ప్రభుత్వం లాటరీ విధానంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టింది.

ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా అందులో నీటి సరఫరా కోసం చేపట్టిన పనులు అసంపూర్తిగానే మిగిలాయి. విద్యుద్దీకరణ కోసం లైన్, ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు జరగలేదు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే

లబ్ధిదారుల కోరిక మేరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఈనెల 19వ తేదీన సందర్శించి, పరిశీలించా రు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరితగతిన చేపట్టి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పూర్తయిన వాటర్ ట్యాంక్ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఆశతో ఎదురు చూస్తున్నాం..



పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికలో లాటరీ పద్ధతిలో తనకు ఇల్లు కేటాయింపు జరిగింది. అద్దె ఇంటి బాధలు తప్పుతాయని సంతోషించాం. 14 నెలలు కావస్తున్నా అధికారులు ఇంతవరకు అసంపూర్తి పనులు పూర్తి చేయలేదు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- పద్మ, లబ్ధిదారురాలు

పనులు పూర్తి చేసి అప్పగించేలా చూస్తాం..



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు అప్పగించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీటి వసతిని ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణాలను ఇదివరకే ఎమ్మెల్యే పరిశీలించారు.

- ఎస్.శ్రీను, ఆర్డీవో

ఎస్పీని సస్పెండ్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ డిమాండ్

కొల్లాపూర్, జూన్ 23 : గడిచిన పది రోజుల క్రితం కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో చెంచు మహిళపై జరిగిన దాడి, అదే కుటుంబానికి చెందిన చెంచు నాగన్న హత్య విషయం మీద స్పందించకుండా నిందితులకు వత్తాసుగా ఉన్న జిల్లా పోలీస్ ఎస్పీని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొలచింతలపల్లి భ్రమరాంబ కాలనీలో నాగన్న హత్య జరిగి పది రోజులు గడుస్తున్నా కుటుంబ సభ్యులు హత్య అని చెప్పినా జిల్లా ఎస్పీ నేటి వరకు హత్యా నేరం నమోదు చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. బాధిత మహిళపై దాడి జరిగిన దానిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రధాన నిందితులను వదిలేసి వారు మళ్లీ బాధితులను చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నా పట్టించుకోకపోవడం, నిందితులకే వత్తాసు పలకడం మూలంగా బాధితులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. దీనంతటికీ కారణం నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకుని ఎస్పీని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొలచింతలపల్లి భ్రమరాంబ కాలనీలో ఆదివాసీలకు ఇచ్చిన ఇళ్ల స్థలా లు అన్యాక్రాంతమైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆదివాసీలకు ఇచ్చిన భూముల ను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ప ట్టా మార్పిడి చేసుకున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే ఆదివాసి భూములను వారికే చెందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళ ఘటన జరిగి పది రోజులు గడిచినా చట్టప్రకారం ఎక్స్ గ్రేషియా అందించాల్సిన రెవెన్యూ అధికారులు స్పందిం చకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నుంచి చెంచులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, భూముల అక్రమ బదలాయింపుల మీద సీబీ సీఐడీ విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోళ్ల శివమాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు మంద నరసింహ, జిల్లా కో కన్వీనర్ బచ్చలకూర లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, నాయకులు శ్రీను, కుర్మయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఎస్పీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్న కోళ్ల శివమాదిగ

దాడి చేసిన వారి ఆస్తి జప్తు చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్: కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామ చెంచు పెంటలో నివసిస్తున్న చెంచు మహిళపై దాడి చేసిన వారి ఆస్తి జప్తు చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు.

ఆదివారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను సీపీఐ నాయకులు పరామర్శించి దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, నా యకులు వార్ల వెంకటయ్య, ఎండీ.ఫయాజ్, కేశవులు గౌడ్, జంగం శివుడు, తుమ్మల శివుడు, లక్ష్మీపతి, మా రేడు శివశంకర్, బాలపీరు, శివశంకర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి

- పార్లమెంట్ సభ్యుడు మల్లురవి
- పార్టీలకతీతంగా సేవ చేస్తానని భరోసా

నాగర్‌కర్నూల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : సమిష్టి కృషితో సమగ్రాభివృద్ధి సాధిద్దామని పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి పిలుపునిచ్చారు. ఎన్నికల వరకే రాజకీయాలని పార్టీలకతీతంగా అందరికీ సేవ చేస్తానని ఆయన భరోసానిచ్చారు. శనివారం రాత్రి గగ్గలపల్లి శివారులో మల్లురవి అభినందన సభ జరిగింది. భగవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మల్లురవి అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ ప్రసంగిస్తూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి తన కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన సోదరుడు మల్లు అనంత రాములు ప్రజలకు విశేష సేవలందించి అభిమానాన్ని చూరగొన్నారని, తాను కూడా అదేదారిలో నడుస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన భగవంత్‌రెడ్డి మాట్లాడుతూ మల్లు రవి సారథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గం సమగ్రమైన అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో నిరుద్యోగులకు ఉపాధి పదేళ్లలో వివిధ సామాజిక వర్గాలకు జరిగిన నష్టాన్ని పూరించాలని అభ్యర్థించారు. సీనియర్ జర్నలిస్టు మహమ్మద్ అబ్దుల్లాఖాన్, మాజీ ఎమ్మెల్యే మోహన్‌గౌడ్, భీష్మ రవీంద్రన్, ఎండి.హబీబ్, వల్లపురెడ్డి, కెన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దూరు రంగారెడ్డి, అచ్చంపేటకు చెందిన రామకృష్ణారెడ్డితో పాటు మల్లురవి అభిమానులు పాల్గొన్నారు.



ఆత్మీయ సభలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు



ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు

లింగాల, జూన్ 23 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, జీతాలు, గుడ్ల బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధమైన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో లింగాల మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల పెండింగ్ బిల్లులు, జీతాలు, గుడ్ల బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 23 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు అధికారంలోకి వస్తే పదివేల రూపాయలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 8నెలలు అవుతున్నా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పు చేసి మరీ గుడ్లు, కూరగాయలు తదితర సరకులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకంలో సిలిండర్లు ఇవ్వాలని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నేడు జరిగే ఆర్డీవో ఆఫీస్‌ల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా రాములమ్మ, కార్యదర్శి గా మంగమ్మ, ఉపాధ్యక్షురాలుగా సరిత, ఆలివేల, సహాయకార్యదర్శిగా గోరమ్మ, సరస్వతి, కోశాధికారిగా అచ్చమ్మను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మల్లేష్ పాల్గొన్నారు.

'ఫీజుల నియంత్రణ చట్టాలెక్కడ?'

అచ్చంపేటటౌన్, జూన్ 23: ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాలెక్కడ అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డేగ అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గాలన్న



గంట్రావుపల్లి గ్రామంలో గాలన్న స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

పెద్దకొత్తపల్లి, జూన్ 23 : జట్టి గాలన్న బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంట్రావుపల్లి గ్రామంలో కామ్రేడ్ జట్టి గాలన్న సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జట్టి గాలన్న స్తూపాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాపసభకు సీపీఐ మండల కార్యదర్శి బొలెద్దుల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ జట్టి గాలన్న పేద ప్రజలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసేవారన్నారు. ప్రతీ కమ్యూనిస్టు ఆయన ఆశయాలను కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పెబ్బేటి విజేయుడు, కోల ఏసయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ దేవతను దర్శించుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి జూన్ 23 : మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఈ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 25వేల మందికిపైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా ఒక లక్ష 60వేల రూపాయలు, టికెట్ల ద్వారా ఒక లక్ష 11వేల రూపాయలు మొత్తం 2లక్షల 71వేల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

వంగూరు, జూన్ 23: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రైతులకు 2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని హర్షిస్తూ సంబురా లు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు వేమారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జంగయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చారకొండ, జూన్ 23: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వర దేవాలయంలో ఈనెల 25 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25న ఉదయం 9 గంటలకు భవద్గీత పారాయణం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు భజన కార్యక్రమాలు, 26న ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అర్చనలు, 11 గంటల 45 నిమిషాలకు శ్రీలక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం అనంతరం తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా కమిటీ సభ్యులను సంప్రదించాలని వారు కోరారు.

జీరో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి, జూన్ 23 : గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల జీరో విద్యుత్ వాడకంపై జీరో బిల్లుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పెద్దకొత్తపల్లి మండల విద్యుత్ ఏఈ ప్రదీప్‌గౌడ్ కోరారు. ప్రజాపాలనలో వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ మీటరు రీడింగ్‌లో జీరో బిల్లు రాని వారు తిరిగి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ ఏఈ ప్రదీప్‌గౌడ్ కోరారు. గతంలో ప్రజాపాలనలో అందజేసిన దరఖాస్తుకు సంబంధించిన రసీదు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు విద్యుత్ బిల్లుల జిరాక్స్‌లు జతపర్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా గోవిందునాయక్



నియామక పత్రాన్ని అందుకుంటున్న కన్వీనర్ గోవిందునాయక్

తిమ్మాజిపేట, జూన్ 23 : నాగర్‌కర్నూల్ జిల్లా సేవాలాల్ కన్వీనర్‌గా తిమ్మాజిపేట మండల పరిధిలోని పుల్లగిరి గ్రామ పంచాయతీ గుంతతండాకు చెందిన ముడావత్ గోవిందు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గోవిందునాయక్ ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తానని తమ కుల సాధనలో సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు తాను అందుబాటులో ఉంటానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు.

చదువుకుంటేనే విద్యార్థులకు భవిష్యత్తు



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఆపరేషన్ స్మైల్ టీం సభ్యురాలు శ్రీజ

అచ్చంపేటటౌన్, జూన్ 23: చదువుకుంటేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని ఆపరేషన్ స్మైల్ టీం సభ్యురాలు శ్రీజ అన్నారు. ఆదివారం పట్టణంలోని వనవాసీ సేవ ప్రకల్ప బాలుర హాస్టల్‌లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదువు నేర్చుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సభ్యులు వెంకటేష్, భాస్కర్, చంద్రశేఖర్, భాను, ప్రసాద్, శ్వేషిత తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన మాటపై కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం'

అమ్రాబాద్, జూన్ 23: రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారంగా రూ. 2 లక్షల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుపరిచి రైతులను రుణ విముక్తులను చేయ డానికి సిద్ధమవుతున్నదని జిల్లా పార్టీ కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు.

అమ్రాబాద్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు.

'రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం'

కల్వకుర్తి, జూన్ 23 : రైతు సంక్షేమమే సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15లోపు చేసేందుకు సీఎం ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఉదయం 11గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, సంబురాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయవాది ప్రకాష్ రెడ్డి ఔదార్యం

- సొంత ఖర్చులతో కాలువలో సిల్ట్ తొలగింపు

అమరచింత, జూన్ 23: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు న్యాయవాది దేశాయి ప్రకాష్‌రెడ్డి మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. భూత్పూర్ రిజర్వాయర్ కాలువ నర్వ మండలం నుంచి అమరచింత మండలంలోని నాగల్ కడుమూర్ గ్రామ శివారు నుంచి పామిరెడ్డిపల్లి మీదుగా అమరచింత పెద్ద చెరువు వరకు సాగునీరు చేరుతాయి. రబీ చివరి నుంచి వేసవిలో ఈ కాల్వలో సాగునీరు వదలక పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం, సిల్ట్ , కంపచెట్లతో కాలువ నిండిపోయింది. జూలైలో సాగునీటి కోసం భూత్పూర్ కాలువ నుంచి నీరు వదిలే కన్నా ముందే కాలువలో ఉన్న సిల్ట్ కంపచెట్లను తొలగించడానికి అమరచింతకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి ముందుకు వచ్చారు. సొంత వ్యయంతో ఆదివారం జేసీబీలు ట్రాక్టర్లను పెట్టి కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించే పనులు ప్రారంభించారు.